# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-02-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. భారత్-ఖతార్ దేశాలు ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేలా పలు అవగాహన ఒప్పందాలను కుదుర్చుకున్నాయి.**

**2. ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వాసాగుకు తగిన సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

**3. సైబర్ నేరాలను నియంత్రించడంలో తెలంగాణ ప్రభుత్వం ముందంజలో ఉందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**

**4. కేంద్ర బడ్జెట్‌పై తిరుపతిలో నిర్వహించే సమావేశంలో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ ఈరోజు పాల్గొంటారు.**

**5 . ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఈరోజు నుంచి ప్రారంభం కానుంది.**

==========================

భారత్-ఖతార్ దేశాలు ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేలా అవగాహన ఒప్పందాలను కుదుర్చుకున్నాయని విదేశీవ్యవహారాల శాఖ కార్యదర్శి అరుణ్ కుమార్ ఛటర్జీ వెల్లడించారు. భారత్ లో పర్యటిస్తున్న ఖతార్ పాలకులు షేక్ తమీమ్ బిన్ హమద్ అల్‌దాని నిన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య పలు ద్వైపాక్షిక చర్చలు జరిగాయని అరుణ్ కుమార్ ఛటర్జీ తెలిపారు. ఈ సమావేశంపై నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ..

..వాయిస్.. 27 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా సాగుకు తగిన సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ –జీఎఫ్ఎస్‌టీ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన 'ఆక్వాకల్చర్ ఇన్నోవేషన్ టెక్ 2.0' సమావేశం ముగింపు కార్యక్రమంలోముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ , ఆక్వా రైతుల గ్రీన్ ఎనర్జీని అందిపుచ్చుకోవాలని అన్నారు. ఆక్వా ఫారాలు, పరిశ్రమల్లో సౌర విద్యుత్తు ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సాయంత్రం ఢిల్లీ వెళ్లనున్నారు.

ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో రేపు జరగాల్సిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు.

-----------------------------

సైబర్ నేరాలను నియంత్రించడంలో తెలంగాణ ప్రభుత్వం ముందంజలో ఉందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు. సైబర్ నేరాలకు పరిష్కారాలపై హైదరాబాద్‌లో నిర్వహించిన 'షీల్డ్ 2025' సదస్సులో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో ప్రత్యేకమైన సైబర్ భద్రతా సంస్థను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ నేరాల దర్యాప్తు కోసం కొత్తగా 7 పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేశామని రేవంత్ రెడ్డి తెలియజేస్తూ,

వాయిస్... 33 సెకన్లు

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రెడ్ క్రాస్ సేవలు మరింత బలోపేతం చేయాలని గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖకు నూతన చైర్మన్‌గా ఎన్నికైన వై.డి రామారావు నిన్న విజయవాడలోని రాజ్ భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో 20 రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రాలలో ప్రజలకు నాణ్యమైన సేవలు అందుతున్నాయన్నారు. రాబోయే రోజుల్లో అన్ని రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లను ఆధునికీకరించి మరిన్ని మెరుగైన సేవలను అందించాలని సూచించారు.

-----------------------------

భారతీయ జనతా పార్టీకి చెందిన ఆంధ్రప్రదేశ్ విభాగం కేంద్ర బడ్జెట్ పై ఈ నెల 22 వ తేదీ వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఈ వార్షిక బడ్జెట్‌లో ప్రజల ప్రయోజనార్థం తీసుకువచ్చిన కొత్త పథకాలు, పలు కీలక అంశాలపై ప్రజలకు తెలియజేసేందుకు కేంద్ర మంత్రులు పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రసంగిస్తున్నారు. ఇందులో భాగంగా ఈరోజు తిరుపతిలో జరిగే సమావేశంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ పాల్గొంటారు.

-----------------------------

గులియన్ బారీ సిండ్రోమ్ –జీబీఎస్‌పై ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడులో నిర్వహించిన క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమంలో నిన్న ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. అలాగే జీబీఎస్ బాధితులకు అవసరమైన ఇమ్యూనో ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని తెలియజేస్తూ...

వాయిస్... 30 సెకన్లు

-----------------------------

మొగల్ పాలనను వ్యతిరేకించి సుస్థిర పాలనను అందించి, గూఢాచారి వ్యవస్థలో దిట్టగా పేరొందిన ఛత్రపతి శివాజీ జయంతి ఈరోజు. శివాజీ అసలు పేరు శివాజీ రాజా బోంస్లే. మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పిన

మహావీరుడు జాతీయ భావాన్ని ప్రజల్లో పాదుకొల్పిన ఛత్రపతి శివాజీ 1630వ సంవత్సరం ఫిబ్రవరి 19వ తేదీన వైశాఖ మాసంలో పూణేలోని జున్నార్ పట్టణం సమీపంలో శివనేరి కోటలో శహాజీ, జిజాబాయి దంపతులకు జన్మించారు. యుద్ధ నైపుణ్యంలో పేరుగాంచిన శివాజీ పేరు వినగానే సింహగడ్ యుద్ధం ప్రతాప్‌గడ్ యుద్ధాలు గుర్తొస్తాయి.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 119వ సంచిక ఈనెల 23వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.“మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 21వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఈరోజు నుంచి ప్రారంభం కానుంది. 4 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ క్రికెట్ టోర్నమెంట్ ఈసారి పాకిస్థాన్, యూఏఇ వేదికలుగా జరుగుతోంది. ఈరోజు మధ్యాన్నం 2 గంటల 30 నిమిషాలకు పాకిస్తాన్‌లోని కరాచి నేషనల్ స్టేడియంలో పాకిస్తాన్, న్యూజిలాండ్ జట్ల మధ్య ఈ ఛాంపియన్స్ ట్రోఫీ తొలి మ్యాచ్ జరగనుంది. తదుపరి మ్యాచ్‌లో భాగంగా భారత్ తన తొలి మ్యాచ్‌ను రేపు దుబాయ్‌లో బంగ్లాదేశ్‌తో ఆడనుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, ఆగ్నేయ గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో పొడి వాతావరణం కొనసాగుతుందని, ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువ నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎల్ నారాయణ తెలుపుతూ..

వాయిస్...21 సెకన్లు

======================